# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

మంగళవారం 28-07-2026

సంపుటి 1 సంచిక 245

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195


హైడ్రా కమిషనర్‌కు

## హైకోర్టులో ఎదురు దెబ్బ

రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలి సీఎస్‌ను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం



**దశ, హైద్రాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. సెక్రటరీ ర్యాంకుస్థానంలో ఉన్న అధికారి కోర్టు ధిక్కరణ సరికాదన్న హైకోర్టు రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఓ ఉన్నతాధికారి ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని పేర్కొంది. కోర్టు ధిక్కరణపై హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు చెప్పారు.



రాష్ట్రంలో గ్రామీణ ప్రగతికి

## కొత్త దారి



### 18,472 కి.మీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ రోడ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (HAM) విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 18,472 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తొలి విడతలో 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తికాగా, ఆగస్టు రెండో వారంలో ములుగు జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పనులను ప్రారంభించనున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మెరుగైన

..మిగతా 4వ పేజీలో →

మాజీ రాష్ట్రపతి

## అబ్దుల్ కలాంకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు



**దశ, హైదరాబాద్:** మాజీ రాష్ట్రపతి 'భారతరత్న' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి వినమ్ర నివాళులర్పించారు. భారత అంతరిక్ష, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధిలో విశేష కృషి చేసి, రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో డాక్టర్ అబ్దుల్ కలాం పాత్ర చిరస్మరణీయమని స్మరించుకున్నారు. రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా వారు చూపిన నిబద్ధత, నిరాడంబర జీవనం, అసాధారణ ప్రతిభకు, అచంచలమైన దేశభక్తికి ప్రతీకగా నిలిచిన డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని

..మిగతా 4వ పేజీలో →



## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

### లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ సవరణ బిల్లు

**దశ, న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు కీలక అడుగు వేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, నినాదాల మధ్య సభలో గందరగోళం నెలకొనడంతో బిల్లుపై చర్చ జరగకముందే లోక్‌సభ వాయిదా పడింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ బిల్లును తీసుకొచ్చారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా కేంద్రం ఈ సవరణలను ప్రతిపాదించింది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీక్ కేసుల దర్యాప్తును రెండు నెలల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. సంఘటిత నేరాల్లో పాల్గొన్న వారికి ఏడేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా బిల్లులో ప్రతిపాదించారు. ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సభలో ఆందోళనకు దిగాయి. విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభల్లో పలుమార్లు అంతరాయం ఏర్పడి సభా కార్యకలాపాలు

..మిగతా 4వ పేజీలో →




ధరణి పోర్టల్‌పై సర్కార్

## సంచలన నిర్ణయం

### ప్రత్యేక విచారణకు ఏడుగురు సభ్యుల కమిటీ

**దశ, హైదరాబాద్:** ధరణి పోర్టల్ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోర్టల్ రూపకల్పన, అమలు, టెండర్ ప్రక్రియ, డేటా భద్రత తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు డీజీ చారు సిన్హా నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన స్పెషల్ ఎంక్వైరీ టీమ్ (ఎస్ఈటీ)ను ఏర్పాటు చేసింది. ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి అమలు వరకు జరిగిన అన్ని ప్రక్రియలను ఈ బృందం సమగ్రంగా పరిశీలించనుంది. టెండర్ ప్రక్రియలో నిబంధనలు పాటించారా, వెండర్ ఎంపికలో ఏవైనా అవకతవకలు జరిగాయా అనే అంశాలపై ప్రత్యేకంగా విచారణ జరగనుంది. అలాగే భూముల వివరాలకు సంబంధించిన డేటా భద్రత, వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం కలిగిందా అనే కోణంలోనూ బృందం దర్యాప్తు చేపట్టనుంది. పోర్టల్ రూపకల్పనలో ఉన్న సాంకేతిక లోపాలు, వాటి కారణంగా ప్రజలు లేదా ప్రభుత్వానికి ఎదురైన ఇబ్బందులు, అనధికార లావాదేవీలు, రెవెన్యూ నష్టానికి దారితీసిన అంశాలను కూడా ఎస్ఈటీ

..మిగతా 4వ పేజీలో →

ఏం చేస్తారో చేయండి..

## మా పెద్దిని కాపాడండి

### వైద్యులకు చేతులెత్తి నమస్కరించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**దశ, హైదరాబాద్:** తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి సికింద్రాబాద్ యశోదా దవాఖానకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ , అందుతున్న చికిత్స గురించి డాక్టర్లతో వాకబు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి అక్కడ పెద్దికి అందుతున్న చికిత్స విధానాన్ని పరిశీలించారు. దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచుని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు.కాగా పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యుత్తమ చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని



అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా.. ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, వారికి భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కేసీఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు. ఆందోళన చెందవద్దని భార్యాపిల్లలకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి గుండె ధైర్యం నింపారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. దాదాపు 45 నిమిషాల పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కేసీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "మీరేం చేస్తారో చేయండి.. కానీ మా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అంటూ డాక్టర్లకు కేసీఆర్ చేతులెత్తి నమస్కరించారు. కాగా.. అమెరికా తదితర విదేశాల నుంచి డాక్టర్లతో మాట్లాడుతూ అవసరమైన సలహాలు తీసుకుంటూ, అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవస్థలతో, సీనియర్ డాక్టర్లతో చికిత్సను అందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఎంఆర్ఐ తదితర అవసరమైన పరీక్షలు చేస్తూ, డాక్టర్ల బృందం చేత సమావేశాలు నిర్వహించుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ, ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచే దిశగా అత్యున్నత చికిత్స అందిస్తున్నామని, డాక్టర్లు తెలిపారు. తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని, దవాఖాన డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండి ఏఎస్ రావు, జెఎస్ రావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు... భార్య స్వప్న

..మిగతా 4వ పేజీలో →

జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా

## మారిపల్లి మాధవి

**దశ, హైదరాబాద్:** తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా సంస్థను నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలి బాధ్యతలను మారిపల్లి మాధవికి అప్పగించారు. సంస్థ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయమని

..మిగతా 4వ పేజీలో →



## ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

### కలెక్టర్ నారాయణరెడ్డి

**దశ, రంగారెడ్డి:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 136 ఫిర్యాదులు

..మిగతా 4వ పేజీలో →



# రాష్ట్రంలో గ్రామీణ ప్రగతికి కొత్త దారి



**మొదటి పేజీ తరువాయి**

రవాణా వ్యవస్థ కీలకమనే భావనతో ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానించే డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టిన ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,703 గ్రామాలను అనుసంధానించేలా 18,472 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి దశలో 2,678 గ్రామాల్లో రహదారుల విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపట్టనుండగా, ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేని 179 మారుమూల గ్రామాలకు 934 కిలోమీటర్ల కొత్త రహదారులను నిర్మించి ప్రధాన రహదారులతో అనుసంధానించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం నుంచి ఈ పనులకు అధికారిక శ్రీకారం చుట్టనున్నారు. గిరిజన, వెనుకబడిన ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం భారతీయ రిజర్వ్ బ్యాంకు అనుమతి కోరుతూ పంచాయతీరాజ్ శాఖ లేఖ పంపింది. ఈ నెలాఖరులోగా అనుమతి లభిస్తే, వచ్చే నెల 15 నాటికి నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు పూర్తి చేసి, ఆగస్టు రెండో వారంలో రాష్ట్రవ్యాప్తంగా పనులు ప్రారంభించనున్నారు. ఈ రహదారులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్ అనుసంధానం వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలవనుందని భావిస్తున్నారు.

# పాలమూరులో 'మినీ మాల్దీవులు'

## అమ్రాబాద్ ఎకో టూరిజానికి రూ.13.75 కోట్ల ప్రణాళిక



**దశ, మహబూబ్‌నగర్:** నల్లమల అడవుల అందాలను ప్రపంచ పర్యాటక మ్యాప్‌పై నిలిపే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయనుంది. రూ.13.75 కోట్ల వ్యయంతో మన్ననూర్, సలేశ్వరం, సోమశిల, దోమలపెంట, ఫర్హాబాద్ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్లను రూపొందిస్తోంది. ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, చెంచు గిరిజనులకు ఉపాధి కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రణాళికలో భాగంగా కృష్ణా నది బ్యాక్‌వాటర్ అందాలతో ప్రసిద్ధి చెందిన సోమశిలను "మినీ మాల్దీవులు"గా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం రూ.5.50 కోట్లతో హైస్పీడ్ జెట్ స్కీయింగ్, సన్‌సెట్ బోటింగ్, ఎకో ఫ్రెండ్లీ వసతి, ట్రెక్కింగ్ ట్రైల్స్, ఏటీవీ రూట్లు, వ్యూపాయింట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పర్యాటకులకు కొత్త అనుభూతిని అందించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. మన్ననూర్ అభివృద్ధికి రూ.7.20 కోట్లు కేటాయించారు. ఫర్హాబాద్‌లో కొత్త వాచ్‌టవర్, ప్రతాపరుద్ర కోట అభివృద్ధి, ఉమామహేశ్వరం ఆలయం వద్ద గెజిబో నిర్మాణం, ఆధునిక సఫారీ వాహనాలు, ప్రత్యేక టూరిస్టు బస్సులు, ప్రధాన ప్రవేశ ద్వారాల నిర్మాణం చేపట్టనున్నారు. సలేశ్వరంమన్ననూర్ సర్క్యూట్ అభివృద్ధికి రూ.50 లక్షలు వెచ్చించనున్నారు. ఇందులో గేట్‌వే, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ట్రెక్కింగ్ మార్గాలు, సందర్శకుల ప్రవేశ నిష్క్రమణ వ్యవస్థలతో పాటు చెంచు గిరిజనుల జీవన విధానాన్ని పరిచయం చేసే కేంద్రం, సావనీర్ షాపులను ఏర్పాటు చేయనున్నారు. దోమలపెంటలో కృష్ణా బ్యాక్‌వాటర్‌లో ప్రత్యేక క్రూయిజ్ బోటు సేవలు ప్రారంభించనున్నారు. దోమలపెంట నుంచి అక్కమహాదేవి గుహల వరకు మూడు 12 సీట్ల బోట్లతో విహారయాత్రలు నిర్వహించేందుకు రూ.55 లక్షలు కేటాయించారు. అలాగే సందర్శకుల వసతి, వ్యూపాయింట్ల ఏర్పాటుతో దోమలపెంటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో అమలు చేయనున్నారు. తొలి దశలో 202627 నాటికి సలేశ్వరం, సోమశిల, దోమలపెంట ప్రాంతాల అభివృద్ధి పనులు చేపడతారు. రెండో దశలో 202729 మధ్య ఫర్హాబాద్ వాచ్‌టవర్, ప్రతాపరుద్ర కోట అభివృద్ధితో పాటు సోమశిలలో జెట్ స్కీయింగ్, సన్‌సెట్ బోటింగ్, దోమలపెంటలో క్రూయిజ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. తుది దశలో 2030 నాటికి కొత్త సఫారీ వాహనాలు, సోమశిలలో ఎకో ఫ్రెండ్లీ రిసార్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను దేశంలోని ప్రముఖ ఎకో టూరిజం గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### శాంతియుత నిరసన
## రాజ్యాంగ హక్కే
### పోలీసుల అతిగా బలప్రయోగం సమర్థనీయం కాదు: సుప్రీం



**దశ, న్యూఢిల్లీ:** శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దాన్ని ఎవరూ నిరాకరించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసులు అతిగా బలప్రయోగం చేయడాన్ని సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్, టియర్‌గ్యాస్ ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్ల విచారణలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. శాంతియుత నిరసనలకు తగిన ప్రోటోకాల్, ప్రత్యేక స్థలాలు ఉండాలని, అయితే సంఘవిద్రోహ శక్తులు చొరబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా విద్యార్థులపై పోలీసుల చర్యలపై సీనియర్ న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేయగా, మరోవైపు కొందరు నిరసనకారులు పోలీసులపై కూడా దాడులు చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చి, "ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదే. పోలీసు సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమైనది" అని వ్యాఖ్యానించారు. పోలీసుల కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఇతర పిటిషన్లతో కలిపి విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

### ప్రతి నీటి బొట్టును సంరక్షించడమే
# భావితరాలకు భద్రత

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది




**దశ సూర్యాపేట ప్రతినిధి :** వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణపై యువతలో అవగాహన పెంపొందించడం ద్వారానే జల భద్రత సాధ్యమవుతుందని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి లు అన్నారు. జాతీయ జల మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 కార్యక్రమాల్లో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "క్యాచ్ ది రైన్ - వేర్ ఇట్ ఫాల్స్, వెన్ ఇట్ ఫాల్స్" అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక రాయన్‌గూడెంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో వ్యాసరచన, పోస్టర్ ప్రదర్శన, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్షాది, కమీషనర్ హన్మంత రెడ్డి లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి సంరక్షణ అవసరాన్ని వివరించారు. వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి విద్యాసంస్థలో, ప్రతి కార్యాలయంలో వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరమని తెలిపారు. విద్యార్థుల్లో నీటి సంరక్షణపై చైతన్యం పెంపొందించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని వారు పేర్కొన్నారు. నీటి వృథాను నివారించడం, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో జాతీయ జల మిషన్ "జల ప్రతిజ్ఞ" చేయించి, నీటి వనరుల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నీటి సంరక్షణ అంశాలపై పోస్టర్లు, వ్యాసాలు, అవగాహన కల్పించే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను పరిశీలించిన ముఖ్య అతిథులు వారి సృజనాత్మకతను అభినందించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమం ముగింపులో "ప్రతి చుక్కను కాపాడితేనే రేపటి తరాలకు నీటి భద్రత సాధ్యం" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు

# 'ఊహించని కరువు వచ్చింది'..

### రైతులకు మంత్రి తుమ్మల కీలక సూచనలు



**దశ, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి తీవ్ర మార్పులకు లోనవుతోందని, గత 150 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల ప్రభావం తగ్గిపోయిందని, దీంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల వరకు కొనసాగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ)తో పాటు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు కూడా రానున్న రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం లేదని హెచ్చరిస్తున్నారని చెప్పారు. వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుతం వరి సాగు చేయడం రైతులకు ప్రమాదకరమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. అదే సమయంలో రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరును మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందాలు వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నాయని మంత్రి తెలిపారు.

## ధరణి పోర్టల్‌పై సర్కార్ సంచలన నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

పరిశీలించనుంది. ఈ వ్యవహారంలో విదేశీ సంస్థల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణాన్ని కూడా విచారణలో భాగంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. అవసరమైతే మధ్యంతర నివేదికలను కూడా ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందని వెల్లడించింది. ధరణి పోర్టల్‌కు సంబంధించి గత కొంతకాలంగా కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విచారణ బృందం రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విచారణ ద్వారా ధరణి పోర్టల్ అమలులో జరిగిన అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### సీఆర్పీఎఫ్ సేవలు యువతకు స్ఫూర్తిదాయకం..

దేశ సమగ్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మహోన్నతమైన సేవలు అందిస్తూ, ధైర్యం, క్రమశిక్షణ, త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) వీర జవాన్లందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడం, శాంతిభద్రతలను పరిరక్షించడం, దేశ అంతర్గత భద్రతను కాపాడడంలో సీఆర్పీఎఫ్ ఎల్లప్పుడూ ముందంజలో నిలిచిందని అన్నారు. దేశ ప్రజల భద్రత కోసం సేవ దృక్పథం, విధేయతతో నిరంతరం విధులు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ దళాల సేవలు ప్రతి పౌరుడికి గర్వకారణమని, వారి అంకితభావం, దేశభక్తి, నిస్వార్థ సేవా తత్వం యువతకు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి

**మొదటి పేజీ తరువాయి**

చెబుతున్న నాయకత్వం, తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలతో ముందుకు సాగుతామనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.మారిపల్లి మాధవిని నియమిస్తూ కవిత సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కొత్త నాయకత్వంలో జాగృతి మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవం, ఆత్మగౌరవ పరిరక్షణే జాగృతి ప్రధాన లక్ష్యమని కవిత పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో 2006లో ఈ సంస్థను స్థాపించినట్లు గుర్తు చేశారు. ఉద్యమానికి సాంస్కృతిక బలం చేకూర్చడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందన్నారు.తెలంగాణ ప్రత్యేకతను దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు సంస్థ నిరంతరం కృషి చేసిందని చెప్పారు. అదే స్ఫూర్తితో ముందుకూ ప్రయాణం కొనసాగుతుందని వెల్లడించారు.తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి విశేష కృషి చేసిందని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుందన్నారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు నిరంతరం పనిచేసిందని వివరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి**

అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి వినిపిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 54, ఇతర శాఖలకు సంబంధించిన 82 దరఖాస్తులు అందగా, మొత్తం 136 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, డా. కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మా పెద్దిని కాపాడండి

**మొదటి పేజీ తరువాయి**

కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధర్మిష్ట, అన్నలు శ్రీనివాసరెడ్డి, రవీందర్ రెడ్డి, చెల్లెలు స్వాతి తదితరులతో మాట్లాడిన కేసీఆర్, వారికి ధైర్యాన్ని భరోసాను నింపారు. కేసీఆర్ తో పార్టీ ముఖ్యులు మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు మాలోత్ కవిత, బాల్క సుమన్, గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, రాజాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేష్, చిరుమల్ల రాకేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## ఉక్కుపాదం..



**మొదటి పేజీ తరువాయి**

వాయిదా పడ్డాయి. మరోవైపు, నీట్ వివాదం నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా పార్లమెంట్‌కు హాజరుకాగా, ఎన్డీయే ఎంపీలు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టి విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com